# బీఆర్ఎస్‌తోనే గిరిజన సంక్షేమం



బీఆర్ఎస్‌లో చేరిన లక్ష్మీపురం వాసులతో ఎమ్మెల్యే హరిప్రియా నాయక్, జడ్పీ చైర్‌పర్సన్ బిందు

- దశాబ్దాల పోడు సమస్యను పరిష్కరించిన కేసీఆర్
- బీఆర్ఎస్ హయాంలో గిరిజన గ్రామాల అభివృద్ధి
- ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియానాయక్
- బయ్యారం ఏజెన్సీలో విస్తృతంగా ప్రచారం

బయ్యారం, నవంబర్ 2 : బీఆర్ఎస్‌తోనే గిరిజన ప్రజల సంక్షేమం సాధ్యమని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియానాయక్ అన్నారు. గురువారం ఆమె మండలంలోని ఇసుక మేది, మిర్యాలపెంట, నారాయణపురం, లక్ష్మీపురం, కంభాలపల్లి, కొయ్యగూడెం గ్రామాల్లో జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందుతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడతూ.. అడవులను నమ్ముకొని జీవిస్తున్న గిరిజనుల దశాబ్దాల పోడు సమస్యకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పరిష్కారం చూపి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపారని అన్నారు. అటవీశాఖ దాడులతో ఇబ్బందిపడిన గిరిజనులకు పోడు పట్టాలు అందించడమే కాకుండా పంట పెట్టుబడి కోసం రైతుబంధు, రైతు బీమా వంటి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. అత్యధికంగా ఇల్లెందు నియోజకవర్గంలోనే 48 వేల ఎకరాలకు పోడు పట్టాలు అందించినట్లు తెలిపారు. గతంలో ఏజెన్సీ గ్రామాలకు రహదారులు లేక ప్రజలు ఇబ్బందిపడేవాళ్లని, ఇప్పుడు సీఎం కేసీఆర్ సహకారంతో ప్రతి గ్రామంలో



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియా నాయక్

రోడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా విరివిగా నిధులు విడుదల చేయడంతో పల్లెలు ప్రగతిపథంలో పయనిస్తున్నాయని తెలిపారు. గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నదన్నారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, బీసీబంధు, మైనారిటీ బంధు, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్‌కిట్, డబుల్ బెడ్రూం ఇండ్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, పోడు పట్టాల పంపిణీ వంటి పథకాలతో పేదలకు మేలు జరిగిందన్నారు. మరోమారు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.400 గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా, పింఛన్లు, రైతుబంధు, ఆరోగ్య శ్రీ పరిమితి రూ.15లక్షలకు పెరుగుతాయని తెలిపారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు.

***బీఆర్ఎస్‌లో పలువురు చేరిక***

మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పోడుగు సుగుణ, ఉప సర్పంచ్ సనప నరేశ్, వార్డు మెంబర్ యశోద, యూత్ లీడర్ ప్రసాద్, వెంకటేశ్, సుధాకర్, నరేశ్ బీఆర్ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాత గణేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బానోత్ మురళీ కృష్ణ, ఆత్మ కమిటీ జిల్లా మెంబర్ ఏనుగుల ఐలయ్య, బానోత్ శ్రీనునాయక్, యూత్ అధ్యక్షులు బానోత్ లక్ష్మణ్ నాయక్, ఆర్వీ, కృష్ణ, నాయకులు వెంకటపతి పాల్గొన్నారు.

## నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

### రిటర్నింగ్ అధికారి జే కాశయ్య



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కాశయ్య

ఇల్లెందు రూరల్, నవంబర్ 2: శుక్రవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ ఉంటుందని రిటర్నింగ్ అధికారి జే కాశయ్య అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బీఆర్ఎస్, సీపీఐ, బీఎస్పీ, టీడీపీ తదితర పార్టీల నాయకులకు నామినేషన్ల స్వీకరణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నామినేషన్లు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తారన్నారు. నామినేషన్లు స్వీకరించేందుకు అధికారులను సమాయత్తం చేశామన్నారు. నామినేషన్ టీం, నామినేషన్ హెల్ప్ డెస్క్ కౌంటర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏ విధంగా నామినేషన్ వేయాలో వారికి అవగాహన కల్పించారు. ఇల్లెందు, గార్ల, బయ్యారం, కామేపల్లి, టేకులపల్లిలో ఏర్పాట్లన్ని సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోట రవికుమార్, అధికారులు విజయ్, ముత్తయ్య, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



టేకులపల్లి: కోయగూడెంలోని సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

# ఇల్లెందులో 50వేల మెజార్టీ తథ్యం

- ప్రజా ప్రభంజనంతో ఆశీర్వాద సభ విజయవంతమైంది
- డిసెంబర్ 3న బొగ్గుట్ట గులాబీమయమవుతుంది: వద్దిరాజు
- ప్రజల ఆశీర్వాదంతో మరింత అభివృద్ధి: హరిప్రియా నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర, వేదికపై ఎమ్మెల్యే హరిప్రియా నాయక్, జడ్పీ చైర్‌పర్సన్ బిందు

ఇల్లెందు, నవంబర్ 2: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియకు 50 వేల మెజార్టీ తథ్యమని రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ ఇల్లెందు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. ఇటీవలి సీఎం ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన స్పందనను చూస్తుంటే అదే స్పష్టమవుతోందని అన్నారు. నియోజకవర్గ ప్రజల ఆదరణతో ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైందని అన్నారు. ఇల్లెందులోని బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు దాదాపు 80 వేల మంది హాజరయ్యారని, ఇంతటి పెద్ద సభను ఈ మధ్య కాలంలో ఎన్నడూ చూడలేదని అన్నారు. సభ విజయం పట్ల ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. ఎమ్మెల్యే హరిప్రియ అడిగిన అన్ని సమస్యలనూ సీఎం పరిష్కరిస్తారని అన్నారు. సభ విజయవంతం చేసిన విధంగానే ఎన్నికల్లో గెలిచేందుకు రానున్న 28 రోజులు కష్టపడి పనిచేద్దామని పార్టీ శ్రేణులకు సూచించారు. తన బిడ్డలాంటి హరిప్రియను గెలిపించాలని సీఎం కేసీఆర్ ఇక్కడి ప్రజలను పిలుపునిచ్చారని అన్నారు. అందుకు అనుగుణంగా ఈ నెల 30న కారు గుర్తుపై ఓటు వేసి అఖండ విజయాన్ని అందించాలని, డిసెంబర్ 3న ఇల్లెందును గులాబీమయం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

***ప్రజల ఆశీర్వాదంతో మరింత అభివృద్ధి: హరిప్రియానాయక్***

బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ మాట్లాడుతూ.. మరోసారి కూడా తనను గెలిపిస్తే ప్రజల ఆశీర్వాదం, ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ఇక్కడి ప్రజల అనేక సమస్యలను సీఎం కేసీఆర్ పరిష్కరించారని, ఇటీవల ఆయన దృష్టికి తీసుకెళ్లిన సమస్యలను పరిష్కరిస్తారని అన్నారు. సీఎం సభ జయప్రదానికి కారణమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు ఆంగోత్ బిందు, డీ రాజేందర్, ఎస్.రంగనాథ్, వరప్రసాద్, లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాసరెడ్డి, పరుచూరి వెంకటేశ్వర్లు, గిన్నారపు రాజేశ్, పాషా పాల్గొన్నారు.

## ఆత్మల శాంతి కోసమే సమాధుల పండుగ

టేకులపల్లి, నవంబర్ 2: క్రైస్తవులు తమ కుటుంబంలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని సమాధుల వద్ద చేసే ప్రార్థనలను సమాధుల పండుగ అని సులానగర్ ఆర్‌సీఎం పెద్ద చర్చి ఫాదర్ తూంపాటి ఆగస్టీన్ అన్నారు. గురువారం మండలంలోని కోయగూడెం గ్రామంలో ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ ఆగస్టీన్ ఆధ్వర్యంలో సమాధుల పండుగను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రైస్తవుల సమాధుల వద్దకు వెళ్లి సమాధులపై పూలు ఉంచి, కొవ్వొత్తులు వెలిగించి, వారి ఆత్మల శాంతి కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం సులానగర్, మాలపల్లి, మూత్యాలంపాడు గ్రామాల్లో సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘస్తులు వేముల రాంపండు, రామ్మూర్తి, కణతల కోటయ్య, పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

**ఇల్లెందు రూరల్‌లో..**

ఇల్లెందు రూరల్, నవంబర్ 2: క్రైస్తవులు సమాధుల పండుగను నిర్వహించారు. గురువారం కొత్తబస్టాండ్ ఏరియాలోని సమాధుల వద్ద చనిపోయిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేసి కొవ్వొత్తులను వెలిగించారు. సీఎస్ఐ చర్చి ఫాదర్ ఫ్రాంక్లిన్ ప్రతీ సమాధి వద్దకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతీ సంవత్సరం నవంబర్ 2న సమస్త ఆత్మల రోజుగా క్రైస్తవులు పండుగలు జరుపుకుంటారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి కమిటీ ట్రెజరర్ కంచి జయరాజు, జేకే చర్చి పాస్టర్ రెవరెండ్ స్పందన, చర్చి కమిటీ సభ్యులు అబ్బూరి సునీల్, అశోక్, కొచ్చర్ల ప్రభాకర్, గంద్రాతి భాస్కర్, క్రైస్తవులు పాల్గొన్నారు.



ఇల్లెందు రూరల్: కొత్త బస్టాండ్ ఏరియాలో..

## హ్యాండ్‌బాల్ రెఫరీగా విష్ణువర్ధన్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 2: నేషనల్ గేమ్స్ రెఫరీగా హనుమకొండ స్పోర్ట్స్ అథారిటీ హ్యాండ్‌బాల్ కోచ్ బొడ్డు విష్ణువర్ధన్‌ను నియమించినట్లు సాట్ డైరెక్టర్ కే లక్ష్మి తెలిపారు. గోవాలో ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు జరుగనున్న నేషనల్ గేమ్స్‌లో హ్యాండ్‌బాల్ రిఫరీగా విష్ణువర్ధన్ వ్యవహరించనున్నట్లు తెలిపారు. నేషనల్ గేమ్స్ కాంపిటీషన్ డైరెక్టర్ ఎం.కార్తికేయన్, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రావు, సాట్ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్‌కుమార్, హనుమకొండ డీవైఎస్‌వో అశోక్‌కుమార్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ అభినందించారు.

## టీపీడీఈఏ నూతన కమిటీ ఏకగ్రీవం

హనుమకొండ సబర్బన్, నవంబర్ 2: తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ స్టేట్ మేనేజింగ్ కమిటీని గురువారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీపీడీఈఏ చీఫ్ అడ్వైజర్ ఆర్ గోవర్ధన్‌రెడ్డి, స్టేట్ సెక్రటరీ జనరల్ పి.బాసిరెడ్డి ఆధ్వర్యంలో ఎలక్షన్ ఆఫీసర్ మోహనమురళి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆర్.గోవర్ధన్‌రెడ్డి చీఫ్ అడ్వైజర్‌గా, పి.బాసిరెడ్డి స్టేట్ సెక్రటరీ జనరల్‌గా, ఎల్ మధుసూధన్‌రెడ్డి స్టేట్ ప్రెసిడెంట్‌గా, పి.శ్రీనివాస్, వి.సుధాకర్‌రెడ్డి స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా, ఎన్.నర్సింహులు, టీ చంద్రశేఖర్ డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా, నరేశ్‌కుమార్ ఫైనాన్స్ సెక్రటరీగా, జె.చంద్రశేఖర్ అసిస్టెంట్ ఫైనాన్స్ సెక్రటరీగా, ఎల్.శ్రీనివాసులు, ఆఫీస్ సెక్రటరీగా, టీ రాజశేఖర్ అసిస్టెంట్ ఆఫీస్ సెక్రటరీగా, టీ రాజశేఖర్, ఇంద్రసేనారెడ్డి, ఎన్.మాధవరెడ్డి, రాజ సురేంద్రచారి ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా, కె.శ్రీనివాస్‌రెడ్డి వెల్ఫేర్ ఫండ్ కమిటీ చైర్మన్‌గా, సెక్రటరీగా సీహెచ్.శ్రీనివాసులు, కోశాధికారిగా రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.